

# జీవితంలో నిప్పులు

-పోలిశెట్టి ఓబయ్య

హైదరాబాదు వెళ్ళే వెంకటాద్రిఎక్స్‌ప్రెస్ మదనపల్లి స్టేషన్‌లో ఆగింది. హైదరాబాదు వెళుతున్న రాజారాం బెర్త్ రిజర్వేషన్‌తో సహా అన్ని ఏర్పాట్లు ముందే చేసేసుకొన్నాడు. సూట్‌కేసు సీటుపై పర్చి కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చే జనాన్ని, దిగే జనాన్ని సరదాగా చూస్తున్నాడు.

నీలిరంగు పట్టుచీర, జడలో ముద్దబంతిపూవు, మెడలో రాళ్ళ నెక్లెస్ అలంకరించుకొన్న ఒకముప్పై ఏళ్ళ స్త్రీ కంపార్ట్‌మెంటులోకి చకచకా ఎక్కింది. రాజారాంకు ఎక్కడో చూసిన గుర్తు ఉంది కాని, ఫలానా అని నిర్ధారణ చేసుకోలేకపోయాడు.

"హల్లో రాజారాం! తలవని తలంపుగా కలిశాము. పదేళ్ళ తరవాత మళ్ళీ కలుస్తామని అనుకోలేదు. అన్నట్టు — ఎంతవరకు ప్రయాణం? చేస్తున్న లెక్చరర్ ఉద్యోగం ఎలా ఉంది?" అని ఒకటే ప్రశ్నల వర్షం కురిపించింది ఆమె.

మాట వెలుగును బట్టి గ్రహించాడు రాజారాం— ఆమె నీలిమేనని. అప్పటి నీలిమలా లేదు. కళ్ళలో చిలిపితనం లేకపోయినా, మాటలో పెంకి దనం మాత్రం ఉంది.

"ప్రశ్నలన్నీ ఇప్పుడే వేస్తే జవాబులు వరసగా చెప్పడం కష్టం. కావలసినంత ప్రయాణం ముందుంది. సీట్లో కూర్చోండి" అంటూ నీలిమకు జాగా చూపించి కాస్త పక్కకు జరిగాడు రాజారాం.

"మీరు మదనపల్లి ఎప్పుడు వచ్చారు? మా ఇంటి ముఖం చూడకుండానే తిరుగు ప్రయాణం కట్టేశారే!" అన్నాడు రాజారాం, ఆమె మీద ఏదో హక్కున్నవాడులా.

"మా మేనత్తకొడుకు పెళ్ళికని మా వారితో వచ్చాను. ఫ్యాక్టరీ పని కుంటుపడుతుందని నిన్ననే మా వారు పూరు వెళ్ళిపోయారు. కాలేజీలో లెక్చరర్‌గా ఉంటున్నావని తెలుసు కాని, మీ ఇంటి అడ్రెస్ నాకు తెలియదు. కష్టపడి కనుక్కోండా మన్నా, నిన్న అంతా ఒకటే వర్షం" అంది నీలిమ, రాజారాం కేసి చూస్తూ.

అప్పటికే ట్రెయిన్ వేగాన్ని పుంజుకొంది. కిటికీలో నుండి వచ్చే చల్లగాలి ఒళ్ళంతా నిమురుతూ గిలిగింతలు పెడుతూంటే కొంగు భుజాల మీదికి తీసుకొంది నీలిమ.

"నీ గురించి చెప్పు, రాజారాం!" అడిగింది నీలిమ.

"తనతో చెలగాటమాడే ప్రతివారికీ మంచిని ప్రసాదించి, స్వయంగా బాధపడే నా జీవితాన్ని గూర్చి ఏం చెప్పను?"

"అదేమిటి, రాజారాం! ట్రెయిన్‌లోకూడా నాటకం డైలాగులు వల్లిస్తున్నావు! మీ ఆవిడ ఎలా ఉంటుంది? మీ పిల్లలేం చదువుతున్నారు?" అంటూ

అందరు ఆడవాళ్ళు అడిగే అతిసాధారణమైన ప్రశ్నలు అడిగింది నీలిమ, రాజారాం కళ్ళలోకి సూటిగా చూస్తూ.

"ఇద్దరు మగపిల్లలూ కాన్వెంటులో చదువుతున్నారు. నా భార్య చాలా కలుపుగోలుగా ఉంటుంది. మా జీవితం వంపులు తిరుగుతూ వెళ్ళే రైలులా ముందుకు పోతూంది. చెప్పుకోదగ్గ విశేషాలంటూ ఏమీ లేవు" అన్నాడు రాజారాం.

నీలిమ మొహం ఎర్రబారింది. ఆమె కళ్ళలోని ఈర్ష్య స్పష్టంగా చూడగలిగాడు రాజారాం.

పదేళ్ళ క్రిందటి రోజులు గుర్తుకువచ్చాయి.

* * *

రాజారాం ఎం. ఏ. చదువుతున్న రోజులవి. నీలిమతో తన పెళ్ళి నిశ్చయమైందని తండ్రి జాబు వ్రాశాడు. పరీక్షలు కాగానే రెక్కలు కట్టుకొని ఇంటిలో వాలాడు రాజారాం.

అదొక మొలకల పూర్ణిమ నాటి రాత్రి. గ్రామమంతా పండుగ జరుపుకొంటూంది. చంద్రుడు తన మృదు హస్తాలతో భూదేవిని స్పృశిస్తున్నాడు. కాబోయే అల్లుళ్ళు, తమ ప్రేమతులను దర్శించుకోవాలని పండుగ నెపంతో ఆహ్వానించాయి అత్త వారి ఇండ్లు. రాజారాం నీలిమ వాళ్ళ ఇంటికెళ్ళాడు. నీలిమను చూడ్డం ఆయన కదే మొదటిసారి. ధర్మవరం పట్టుచీర శరీరం కనబడకుండా కట్టుకొంది. మోచేతుల వరకూ జాకెట్టూ, నుదుట ఎర్రని కుంకుమబొట్టూ, కొప్పులోని సన్నజాజులు, మరీ అంత ఉండీ లేదూ అనిపించనంత సన్నంకాని నడుము తన తండ్రి సెలెక్షన్ రాజారాంకు ఎంతో నచ్చింది. అందుకే పెద్దల సంప్రదింపులు లేనిదే పెళ్ళిళ్ళు చేసుకోకూడదు అంటుంది లోకం అనుకొన్నాడు రాజారాం.

భోజనాలయ్యాక మంచాలు వాల్చుకొని కూర్చున్నారు ఇంటిల్లిపాదీ.

"బాబూ! వచ్చేనెలలో ముహూర్తాలు ఉన్నాయట. నీవు సరేనంటే నాన్నగారితో మాట్లాడి పెళ్ళికి ముహూర్తం పెట్టిస్తాను" అన్నాడు కాబోయే మామ.

రాజారాం కళ్ళు తిరిగిపోయాయి. ఆడదంటే ప్రతి మగ వాడికీ ఇష్టమే కాని పెళ్ళంటే బెదిరిపోతారు.

"మామగారూ! నా దీ సంవత్సరం ఎం. ఏ. ఫైనల్ ఇయర్. పెళ్ళి చేసుకొని నేను చదవడం, నీలిమ మీ ఇంట్లో ఉండడం—మన అందరికీ బాధ కలిగించక పోయినా, చూసే వాళ్ళకు చులకనగా ఉంటుంది. ఇప్పుడేం మునిగిపోయింది? వచ్చే ఏడు చదువు పూర్తి కాగానే పెళ్ళి చేసేసుకొంటాము" అన్నాడు రాజారాం.

"సరే నీ ఇష్ట ప్రకారమే కానివ్వు, బాబూ" అన్నాడు నీలిమ తండ్రి.

తెల్లవారింది. చంద్రుడు—సూర్యుడు కనబడ్డంతోటే మాయమయ్యాడు తన పని పూర్తయిందంటూ. రాజారాం నిద్ర లేచి అలా ఏటి వైపుకి వెళ్ళి వస్తున్నాడు.

పూరి వెలుపల శివాలయం గంటలు మ్రోగడంతో రాజారాం తల ఎత్తి చూశాడు. పూలసజ్జ చేతిలో ఉంచుకొన్న నీలిమ గుడి వాకిట నిలుచుంది. ఆమె విశాలమైన పసిమి వన్నె నుదుటిపై ముంగురులు చల్లగాలికి లాస్యం చేస్తున్నాయి. అందమైన కనుబొమల మధ్య ఎర్రని తిలకం మెరుస్తూ పొడవుగా సూటిగా పోయే సన్నని ముక్కునే పరికిస్తూంటే, వంపులు తిరిగిన ఎర్రని పెదవులు సన్నగా నవ్వుతుంటే ముందుకు పోలేక పోయాడు రాజారాం. అప్రయత్నంగానే అతనికాళ్ళు గుడిమెట్లు ఎక్కి నీలిమ దగ్గర చేరిపోయాయి. ఇద్దరూ గుడి ప్రాంగణంలో కూర్చున్నారు.

"మనసు విప్పి మాట్లాడే అవకాశాన్ని ఇచ్చిన ఈ శివుడికి థాంక్స్ చెప్పాలి కదా, నీలిమా?" అన్నాడు రాజారాం.

నీలిమ సిగ్గుతో తలవంచుకొని నేలపై గీతలు గీస్తూంది. రాజారాంలోని కవి, కథకుడు బుసలు కొడుతున్నాడు.

"నీవెలా ఉన్నావో తెలుసా? పాలరాతిబొమ్మలా, పూపిరి తీసుకొనే శిల్పంలా ఉన్నావు. శేత పసుపు రంగు చీరలో ఏ కవీ వర్ణించని రసమయమూర్తిలా, ఏ శిల్పి చిత్రించలేని శిల్పంలా ఉన్నావు" అన్నాడు రాజారాం, ఆమె కళ్ళలోకి చిలిపిగా చూస్తూ.

"ఏమండీ! మీకు కథలు వ్రాయడమే కాక కవిత్వం కూడా వచ్చా?" అడిగింది నీలిమ.

"నిన్ను చూస్తూంటే కవిత్వమే కాదు — ఏమైనా అవుతుంది" అంటూ నీలిమను దగ్గరగా తీసుకొన్నాడు. చుట్టూ చెట్లు, వాటిని పైన వేసుకొని పాకే తీగలు, మధ్య నృత్య భంగిమలో పార్వతీ దేవిని కౌగిలించుకొంటున్న అర్థనారీశ్వరుడు.

నీలిమ రాజారాం ఒడిలో వాలిపోయింది. ఆమె ఎదపై శిల్పాలు వ్రాస్తున్నాడు వ్రేళ్ళతో రాజారాం.

"ఏమండీ! ఇంతవరకు మీరే మాట్లాడారు. ఇప్పుడు నాకూ మాట్లాడాలనిపిస్తూంది. మనపెళ్ళి ఈ సంవత్సరమే ఎందుకు జరగకూడదూ?" అంది మెల్లగా నీలిమ.

"మనకు పెళ్ళి ఒకటే హద్దు కాదు. మనం ఇద్దరం కొంతకాలం భవిష్యత్తులో గడిపే సుఖాల్ని తలచుకొని కలలు కనాలి. మన ప్రణయ జీవితం ప్లాన్డ్‌గా చకచకా ముందుకు పోవాలి. హనీమూన్‌తో మొదలయిన ఎన్నో వెన్నెల రాత్రులు నిద్ర లేకుండా గడవాలి. పెళ్ళంటూ జరిగితే ప్రేమ అనే పదంలోని మాధుర్యం నశించి జీవితం యాంత్రికంగా తయారవుతుంది. ముందు మనం ప్రేమించుకోవాలి. ప్రేమ అనే బంధంలో భార్యాభర్తలం కావాలి" అన్నాడు రాజారాం.

నీలిమలోని భావాలకు కొత్త అర్థాలు చెప్పాడు రాజారాం.

"ప్రొద్దెక్కింది పల్లెపడుచులు సోమవారం శివాలయానికి వస్తున్నారు. వెళ్ళి మన పెళ్ళి జరగాలంటూ శివునికి ఒక మాట చెప్పిరా—నేను ఇంటికి వెళుతున్నా" అన్నాడు రాజారాం.

రాజారాం పూరు వెళ్ళిపోయాడు. కిటికీలోంచే ఆయన వెళ్ళిన దారికేసి చూస్తూ నిలబడింది నీలిమ.

• • •

సంవత్సరం గడిచిపోయింది. ఢిల్లీ సింహాసనాన్ని క పార్టీ వదిలి, మరొక పార్టీ ఎక్కింది. గద్దె


మీకుపయోగించేది

ఇంట్లో ఎవరికే రోగం వచ్చినా కంగారు పడేపనిలేదు. ఐదురకాల ప్రఖ్యాత వైద్యుల ప్రతిరోగానికి, రోగలక్షణాలు, వాటి నివారణకు ఇంగ్లీషు, ఆయుర్వేద, ప్రకృతి, యూనాని, హోమియో మందులు "ఐదువైద్య విధానాలు" అనే తెలుగు పుస్తకంలో అందరికీ తెలిసేలా వ్రాశారు. అన్ని షాపుల్లో దొరికే మందులే. 427 రోగాలు నయము చేసుకొనే మార్గాలున్నాయి. వెలరూ. 16. పోస్టు ఖర్చులదనం. దేశసేవ ప్రచురణలు. 5/3 ఆర్.టి. పంజాగుట్టకాలని, హైదరాబాదు-4 కు, మీకో పుస్తకం వి.పి. పోస్టులో పంపుమని వెంటనే వ్రాయండి.



దేహపుష్టికి ఆరోగ్యానికి

పండిత డి. గోపాలాచార్యులవారి

జీవామృతం

1898 నుండి ప్రసిద్ధి గాంచినది

ఆయుర్వేదాశ్రమం

(ప్రైవేట) లిమిటెడ్

మదరాసు-17.



డా॥ పి. వి. కె. రావ్, B.A.



సెక్స్ స్పెషలిస్ట్

(వైద్య విద్వాన్-వైద్యాచార్య)

వివాహము వాయిదా వేయ నవసరము లేదు. మూత్రకోశ ములవలన కలిగిన నరముల బలహీనత, ముఖ్యవ్యాధులకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా కూడ చికిత్స కలదు ... ...

రావూస్ క్లినిక్,

టి.బి. రోడ్, తెనాలి. ఫోన్: 700.



ఉచితం! ఉచితం!

తెల్లమచ్చలు

అన్ని రకాల మచ్చలను, ఎరుపు రంగుమచ్చలను మా ప్రఖ్యాత మందు అంతటి గొప్పది మార్చును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచారము నిమిత్తం ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి.

BHARAT AYURVEDASHRAM

P.O. Katri Sarai (GAYA)

నెక్కిన మంత్రులెందరో కార్మిక ప్రభుత్వం స్వాధీనం చేసి వీధుల వెంబడి నడవలేక చస్తున్నారు. ఫైనలియర్ పరీక్ష వ్రాసేసిన రాజారాం చాలాకాలానికి సినిమా ప్రోగ్రామ్ పెట్టుకొన్నాడు. గాంధీరోడ్డు వెంట నడుస్తున్నాడు. ఇరువైపులా బ్రాందీ షాపులు, బార్‌లు. గాంధేయులు, ఖద్దరు వాడకం పెరిగిన రోజుల్లోనే బ్రాందేయుల సంఖ్య పెరుగుతున్నందుకు చింతిస్తూ అడుగు ముందుకు వేస్తున్నాడు రాజారాం. బాల్యమిత్రుడు రామారావు తారసపడ్డాడు. నీలిమ ఇంటి ప్రక్క ఇల్లే వారిది.

“హల్లో రాజారాం! నీతో ముఖ్యమైన విషయం మాట్లాడాలి” అంటూ మొదలెట్టాడు రామారావు.

“పోయిన నెల రెండవ తారీఖు నీలిమ చెల్లెలి పెళ్ళి చూపుల కని కర్నూలు నుండి ఫియట్ కారులో ఒక కుర్రవాడు వచ్చాడు. చెల్లెలిని ముస్తాబు చేస్తూ ఉన్న నీలిమను చూశాడు. తను నీలిమనే పెళ్ళి చేసుకొంటానన్నాడు.”

“వాడెవడ్రా ఫూల్! నీలిమతో నా పెళ్ళి సంవత్సర క్రితమే ఖాయమైపోయింది. మా నాన్న ఆమె మెడలో బంగారం కూడా వేశాడు. అది వాడికి తెలియదు. పాపం!” అన్నాడు రాజారాం చిరాకుగా.

“కూతురు లక్షాధికారి భార్య కావాలని ప్రతి తండ్రీ కలలు కంటాడు. నిశ్చితార్థాలూ, లగ్న పత్రికలూ ఆ కలల ముందు కరిగిపోతాయి. నాకీ పెళ్ళి వద్దని ఎంత మారాము చేసినా, నీలిమ మొర ఎవ్వరూ పట్టించుకోలేదు. ఆడపిల్ల మనసు అర్థం చేసుకొనే తల్లి కూడా తండ్రిదారే అనుసరించింది. నిన్ననే నీలిమ పెళ్ళి జరిగిపోయింది.”

రాజారాం గుండె పగిలిపోయినట్లనిపించింది. ఆకాశంలోని చుక్కలు తన్నే హేళన చేస్తున్నట్లున్నాయి. తన జీవితనావ నడి సముద్రపు పెను తుఫానులో చిక్కుకొంది. తనెలా బ్రతకాలి? ఎవరి కోసం బ్రతకాలి? అని ప్రశ్నలు వేసుకొంటూ సినిమా ప్రోగ్రామ్ కాన్సిల్ చేసుకొని రూమ్‌కు వెళ్ళి సామాను సర్దుకొన్నాడు. మరునాడే వూరు వెళ్ళిపోయాడు. వీధిని బడ్డ తన బతుకే వీధికంతా మాట్లాడే విషయం. హేళన చేసే లోకానికి తనూ మగవాడని నిరూపించాలనుకొన్నాడు. అయిన సంబంధం చూసి తనూ పెళ్ళి చేసేసుకున్నాడు.

* * * *

తిరిగి ఇన్నాళ్ళకు నీలిమ మంగళసూత్రంతో కనిపించడం ఇదే ప్రథమం. మనసులోని బాధ కనబడకుండా నవ్వుతూ మాట్లాడుతున్నాడు. తను కాలేజీలో లెక్చరరయినప్పుడు మొదలుపెట్టి సాహిత్య అకాడమీ మెంబరయినంతవరకు — ఒకటేమిటి? అన్నీను. కానీ, మధ్య మధ్యలో తెలియని బాధ పెల్లుబికి రావడం గమనిస్తూంది నీలిమ.

“మీ ఆవిడ అందంగా ఉంటుందా, రాజారాం?” అడిగింది నీలిమ.

“అవసరమైనంత అందం ఉంది కానీ, వారెలా ఉంటారు? ఆయన హాబీస్ ఏమిటి?” అడిగాడు రాజారాం.

“మా వారిని గురించి ఏం చెప్పను, రాజారాం? మా వారికి లేని అలవాటంటూ లేదు. ఆయన అల్ట్రామోడర్న్ సివిలైజ్‌డ్ మాన్. రాత్రిళ్ళు పన్నెండు గంటలకు కాని బార్ నుండి ఇంటికి రారు. ఏమైనా మాట్లాడితే తన్నుతారు. అనుకొన్న ఆవిడ భార్య కాలేదని, ఆ కసి నా మీద తీర్చుకొంటున్నారు. పాత గిరాకీని పలవరిస్తూ నిద్రపోతారు. యాంత్రిక జీవితంలో భాగంగా నేనూ పిల్లల్ని కన్నాను. నేను కావాలనుకున్న జీవితం ఇది కాదు” అంది నీలిమ, చీకట్లో కదిలిపోతూన్న కొండ గుట్టల వరుసలను చూస్తూ.

రాజారాం పైకి దీర్ఘంగా నిట్టూర్చినా, కొంత వూరట మాత్రం కలిగింది. ‘ఇరువురం ఒకే పడవలో పయనిస్తున్నా’ మనుకొన్నాడు. తన ఒడిలో ఒదిగిపోవలసిన నీలిమ వేరొకరి ఒడిలో ఒదిగిపోవడం రాజారాంకు సుతరామూ ఇష్టములేదు.

“కర్నూలు స్టేషను వస్తూంది, రాజారాం! మనం విడిపోయే క్షణం దగ్గరికి వచ్చింది. మళ్ళీ ఎప్పుడో, ఎక్కడో మన కలయిక?” అంది నీలిమ రాజారాం కేసి సీరియస్‌గా చూస్తూ.

“అలా మాట్లాడకు. నీవలా మాట్లాడితే నేను చాలా బలహీనుణ్ణైపోయితాను. మన బంధం పవిత్రమైంది. ఒడ్డులొరసి ప్రవహించే నదులు, పువ్వులపై వాలే తుమ్మెదలు మన కథనే పాడుకొంటాయి. నిత్యమూ మన మనసులు కలుసుకోవాలి.”

“ఇక చాలు గాని, రాజారాం, రైలు ఆగింది. అదిగో మా వారు స్టేషనుకు రానే వచ్చారు” అంటూ చేయి వూపింది నీలిమ.

ఆరడుగుల పొడవు, ఆకర్షణీయమైన పురుషాకారం తన కంపార్ట్‌మెంట్‌కు రావడం గమనించాడు రాజారాం.

‘ఎంత దురదృష్టవంతుడివయ్యా! నీలిమ లాంటి ఇల్లాలిని ఇంటి దీపంగాపెట్టుకొని వెలుగులోనే అంధకారాన్ని వెతుకుతున్నావు. ఆ దీపాన్ని పోగొట్టుకొని అంధకారంలో బ్రతుకుతున్నాను నేను. విధి లీల ఎంత విచిత్రమైంది!’ అనుకొన్నాడు రాజారాం.

ఆయన కంపార్టుమెంటు కిటికీ దగ్గరికి వచ్చి సామాను ప్లాట్‌ఫారంపై దించాడు.

“వీరే రాజారాం గారు” అంటూ పరిచయం






చేసింది నీలిమ. ఆయన షేక్ హాండిచ్చాడు రాజారాంకు.

"మిమ్మల్ని చూడ్డం నా కిదే తొలిసారి. మీ గురించి నాకు బాగా తెలుసు. మీరెప్పుడైనా కర్నూలు వస్తే మా ఇంటికి తప్పక రండి.

"నీలిమా! నువ్విక్కడే ఉండు. మన కారు డ్రైవర్ని పిలుస్తాను. వాడిప్పుడే పెట్రోలు కోసం అటు వెళ్ళాడు" అంటూ గబగబా స్టేషను బయటికి నడిచాడు నీలిమ భర్త.

"నీలిమా! నీ భర్త తాగుబోతులా కనిపించడం లేదు కదా? నిన్ను ఆరాధించే భక్తుడులా ఉన్నాడే!" అన్నాడు రాజారాం, ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తూ.

నీలిమ నవ్వింది. ఆ నవ్వులో ఏదో అవహేళన రాజారాంకు స్పష్టంగా కనపడింది.

"సారీ, రాజారాం! నేనంటే మా వారికి పంచ ప్రాణాలు. ఆయన కే దురవాట్లూ లేవు. నీ మూడ్ని చూడ్డానికే అలా అన్నాను. నే నిప్పుడు మునుపటి నీలిమను కాను. నా కంటూ కోరికలు లేవు. బాధ్యత కలిగిన ఆయిల్ ఫాక్టరీ ఓనర్ భార్యను. నా బలహీనత మా వారి జీవితంలో నిప్పులు పోస్తుందని గత స్మృతుల్ని నే నెప్పుడో మరచి పోయాను.

"నీ వైవాహిక జీవితం సుఖంగా లేదని విన్నాను. లోకంలో ఎన్నో పీటల మీది పెళ్ళిళ్ళు ఎగిరి పోయాయి. వాళ్ళంతా నీలా తాగి కట్టుకొన్న పెళ్ళాల జీవితాల్లో నిప్పులు పోస్తున్నారా? కట్టుకొన్న స్త్రీని పోషించక పుట్టింటికి తరుముతున్నారా? ఎంత వూహాల్లో బతికినా, ఎంత భావుకత ఉన్నా మనిషికి అనుభవాలూ, సంసారసుఖమూ, పిల్లలూ— వాటి చుట్టూ ఉన్న ప్రేమ ముఖ్యం. వాటి కోసమైనా నీవు నీ భార్యను సరిగా చూసుకోవాలి. ప్రేమకోసం జీవితాన్ని బలి చేసుకోవడం పిరికితనం.

"నేను నా భర్తతో సుఖపడడం నీ కిష్టంలేక పోవచ్చు. నీవు, నీ భార్యా సంతోషంగా ఉండాలని నే కోరుకొంటాను. అదే స్త్రీ పురుషుల మనస్తత్వాల తేడా. నువ్వింకా నా గురించే ఆలోచిస్తూ నీ జీవితాన్ని పాడు చేసుకొంటున్నావు. నేను నిన్నెప్పుడో మరిచిపోయాను. మరిచి పోక తప్పనూ లేదు.

"ఇకనైనా ఆమె నలా బాధించకు" అంది నీలిమ.

నీలిమ ఉపదేశం అర్థం చేసుకోవడానికి అయిదు నిమిషాలు పట్టింది రాజారాంకు.

ట్రెయిన్ కూత వేసింది.

రాజారాం సీట్లో కూర్చున్నాడు.

ప్లాట్‌ఫారంపై నిలుచున్న నీలిమ దూరం కావడం గమనిస్తున్నాడు. ఆమె చేయి వూపుతూంది. తన ఉపదేశం పాటించమంటూంది. పాటి స్త్రీ జీవితంలో ఆనందం నింపమంటూంది. పాత జీవితాన్ని మరిచి ముందుకు పొమ్మంటూంది పట్టాలపై వేగంగా పరుగెత్తే రైలు. *



## పేచీ లేదు

ఒక గృహిణి పనిమనిషిని ఇంటర్వ్యూ చేస్తోంది. "ఇదిగో నీ పేరేమి టన్నావ్?"

"మాధురి అండీ."

"చూడు మాధురీ! నిన్ను పెట్టుకున్నేముందు మా వారిని గురించి నీకు చెప్పాలి, జాగ్రత్తగా విను. నీవు చాలా అణకువగా ఉండాలి. చెప్పినట్టు వినాలి. నేను ఇంట్లో ఉన్నా లేకపోయినా, నువ్వు ఇంట్లో స్వంత మనిషిగా ఉండాలి. పితూరీలు చెప్పకూడదు" ఇంకా ఏదో చెప్పబోతూండగా—

"అమ్మగారూ! నాకూ ఒక మొగుడు, ఒక బిడ్డ ఉన్నారు తల్లీ! మీరు అంతగా చెప్ప నవసరం లేదు" అంది.


# JOIN AT ONCE

ఉత్తమ ఫలితము! అతి తక్కువ రుసుము! ప్రశస్తమైన పోస్టల్ ట్యూషన్!

1. M.B.A., M.B.M., A.M.I.B.M., D.B.A., D.B.M. LLB., (All degree holders are eligible)
2. MYSORE/ANDHRA B.A., B.COM., & M.A. (No previous school or college study required)
3. OSMANIA B.A., B.COM. (One sitting) (P.U.C./ Inter passed are allowed)
4. S.V.M.A/M.COM., (Two sittings)
5. COM. UNIVERSITY INTER. D.COM., B.COM., B.COM (Hons), M.COM., (S.S.L.C., S.S.C., H.S.C., Matric, Inter, P.U.C. Pre-degree Engg. Diplomas passed/failed are eligible).
6. ANDHRA MATRIC (No previous school study required)
7. HOMOEOPATHY
8. ACCOUNTANCY
9. ALLOPATHY
10. SERVICE COMMISSION.

ప్రపంచంలో ప్రజామోదం పొందిన, ప్రశస్తమైన విద్యాసంస్థ!

ఐ. ఎ. ఇ., ఐ. బి. ఎ. ఎస్., ఎ. ఐ. సి. ఎ. అండ్ కామ్. యూనివర్సిటీ లచే గుర్తింపబడి, వాటిని అనుబంధింపబడినది.

గ్యారంటీ సర్టిఫికెట్లు జారీ చేయబడును.

పూర్తి వివరములకు దయచేసి రు. 2/- మనియార్డరు పంపించండి.

## SRI MURUGAN TUTORIALS

(Estd. 21-3-1952 * Govt. Regd. No. 3072)

**H. O. RISHIVANDIYAM-606 205, Tamil Nadu.**

**Regional Office: 41, Arcot Road, Kodambakkam, MADRAS-24.**